ఏపీ ఈఏపీసెట్-23

అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు 43,929 మంది హాజరు

ప్రజాశక్తి-అనంతపురం

అగ్రికల్చర్, ఫార్మాసీ విభాగాల్లో ప్రవేశానికి సోమవారం నిర్వహించి ఏపీ ఈఏపీసెట్-23 మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం, సాయంత్రం జరిగిన పరీక్షలకు 48,622 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 43,829 మంది విద్యార్థులు హాజరు అయ్యారు. ఆంధ్ర, తెలంగాణ రాష్టాలకు కలిపి 118 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా, 90.35 శాతం హాజరు నమోదు అయ్యింది. ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జెఎన్‌టియు విసి రంగజనార్ధన, పరీక్షల కన్వీనర్ శోభాబిందు తెలిపారు.

'విత్తు'కోసం వెతుకులాట..!

◆ కొనసాగుతున్న విత్తన రిజిస్ట్రేషన్లు ◆ నామమాత్రంగానే స్పందన

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు పడుతుండటంతో రైతులు సేద్యానికి సన్నద్ధమవుతున్నారు. దుక్కులు దున్నుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. ఇదే సమయంలో విత్తన పంపిణీకి ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు ప్రారంభించింది. రిజిస్ట్రేషన్ సమయంలోనే డబ్బులు కూడా ముందుగానే చెల్లించాల్సి ఉంటుంది. అటు వ్యవసాయ పనులకు, ఇటు విత్తన కొనుగోళ్లకు డబ్బులు అవసరమవడంతో రైతులు విత్తు కోసం వెతుకులాట మొదలు పెట్టారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా ఇస్తామని ప్రకటించింది. పోయిన సంవత్సరాల్లో అదేరకంగా ఇస్తూ వచ్చింది. గతేడాది అనంతపురం జిల్లా పరిధిలో 2,83,063 మందికి రూ.320.17 కోట్లు అందజేసింది. కాని ఈసారి ఇప్పటి వరకు రైతులకు రైతు భరోసా అందలేదు. ఈనెలలో రైతు భరోసా రైతులకు ఇచ్చి ఉంటే ఇప్పుడు విత్తన కొనుగోళ్లకు అవకాశం ఉండేది. ఎప్పుడు ఇస్తుందో ఇంకా ప్రభుత్వం ప్రకటించలేదు. ఇకపోతే బ్యాంకుల్లోనైనా రుణాలు అదనంగా ఇచ్చే అవకాశం లేకుండా ఉంది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ఇదివరకే తీసుకున్న రుణం ఇప్పుడు చెల్లించి రెన్యువల్ చేసుకోవడానికే రైతులు బయట అప్పు తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికే బ్యాంకుల్లో పంటరుణాలను రెన్యువల్ చేస్తున్నారు. గతేడాది అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నా బీమా ఏదీ రైతుకు అందలేదు. దీంతో పైసల కోసం రైతులు బయట ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది.

22,184 మంది రిజిస్ట్రేషన్

జిల్లాలో రెండు లక్షలకుపైగా రైతులుంటే అందులో పదో వంతు వరకే విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 78,245 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనమివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సేకరణ ప్రక్రియను కొనసాగిస్తోంది. అదే సమయంలో విత్తనం అవసరమైన రైతులను రిజిస్ట్రేషన్ చేసుకొమ్మని చెప్పింది. ఇప్పటి వరకు జిల్లాలో 22,184 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 19,601 క్వింటాళ్ల విత్తనం దీనికి సరిపోతుంది. ఈనెల 25వ తేదీ నుంచి విత్తన పంపిణీని ప్రారంభిస్తామని ఒకవైపు అధికారులు చెబుతున్నారు. విత్తన కొనుగోళ్లకు రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. విత్తన కొనుగోళ్లకు ముందుగా డబ్బులు చెల్లించేందుకు ఆర్థిక సమస్యలు కారణమయితే... విత్తన నాణత్యపైనా రైతుల్లో సందేహాలున్నాయి. దీంతో ప్రభుత్వమిచ్చే సబ్సిడీ విత్తనం కొనుగోలుకు వెనకడుగు వేస్తున్నారు.

రైతుకు భరోసానివ్వాలి

రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధమవుతున్నారు. అయితే గతేడాది సరైన పంటలు రైతులకు రాలేదు. దీంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం రైతు భరోసాను అందజేయాలి. అది వస్తే విత్తన కొనుగోళ్లు చేసుకోవడంతో పాటు, దుక్కులు దున్నుకునేందుకు అయ్యే ఖర్చులకైనా రైతులకు వస్తాయి. అదే సమయంలో గతేడాది నుంచి వరుసగా ప్రకృతి వైపరిత్యాలతో రైతులు నష్టపోయి ఉన్నారు. వారికి బీమా అందించి ఆదుకోవాలి. ఈ డబ్బులను సీజన్ ప్రారంభానికి ముందే ఇస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

చంద్రశేఖర్‌రెడ్డి,
ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

విషాదం..!

◆ ఇద్దరు విద్యార్థుల ప్రాణంతీసిన ఈతసరదా
◆ పెద్దజలాలపురం కూతలేరు వంకలో ఘటన

ప్రజాశక్తి-శింగనమల

సెలవుల కోసం బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు చిన్నారులు అనుకోని ఘటనతో మృత్యువాత పడ్డారు. ఈతకొట్టాలన్న సరదా వారి ప్రాణాలను తీసింది. సాయంత్రం సరదాగా ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు నీటమునిగి మరణించారు. శింనగమల మండలం పెద్దజలాలపురం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్న ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... కడప జిల్లా కొండాపురం మండలం ధర్మాల గ్రామానికి చెందిన సరస్వతి కుమారుడు బాలు(16), అదే గ్రామానికి చెందిన ఈమె అన్న కుమారుడు హేమాద్రి(10)లు పెద్దజలాలపురం గ్రామంలోని సరస్వతి బంధువు గొల్ల రామచంద్రారెడ్డి ఇంటికి వేసవి సెలవుల నిమిత్తం వచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామ సమీపంలోని కూతలేరు వంకలోకి సరస్వతి మరో మహిళతో కలిసి బట్టలు ఉతికేందుకు వెళ్లారు. వీరితో పాటు బాలు, హేమాద్రి కూడా వెళ్లారు. మహిళలు బట్టలు ఉతుకుతుండగా ఈ పిల్లలు ఇద్దరు ఈతకోసం వంకలోకి దిగారు. వంకలో నీటి లోతు ఎక్కువగా ఉండడంతో హేమాద్రి అందులో మునిగిపోయాడు. ఈ బాలున్ని రక్షించేందుకు బాలు వెళ్లాడు. నీటిలోతు ఎక్కువగా ఉండడంతో ఇద్దరు చిన్నారులు అందులో మునిగిపోయారు. గట్టున ఉన్న మహిళలు చూస్తుండగానే ఇద్దరూ మునిగిపోయారు. దీంతో వారు పెద్ద ఎత్తున కేకలు వేశారు. అటుగా వెళ్తున్న వారు గుర్తించి నీటిలో దిగి చిన్నారుల కోసం వెతికారు. నీటి అడుగున ఉన్న వారిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. సరదాగా నీటిలో ఈతకొడుతున్న ఇద్దరు పిల్లలు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మృతి చెందిన చిన్నారులు... రోదిస్తున్న కుటుంబ సభ్యులు

'ఉపాధి' పరిరక్షణ కోసం 25న కలెక్టరేట్ వద్ద ధర్నా : వ్యకాసం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కేంద్రంలోని బిజెపి చర్యలను నిరసిస్తూ ఉపాధిని రక్షించుకునేందుకు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన అనంతపురం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణమూర్తి, గౌరవాధ్యక్షురాలు వి.సావిత్రి తెలిపారు. సోమవారం ఉదయం అనంతపురం నగరంలోని గణేనాయక్ భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. ఉపాధి చట్టంలో వచ్చిన కొత్త మార్పుల వల్ల కూలీలకు తీవ్ర నష్టం వాటిల్లితోందన్నారు. రెండు పూటలా పని విధానాన్ని తక్షణం రద్దు చేయాలన్నారు. పని ప్రదేశాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. 100 రోజులు పనులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 100 రోజులు పనులు కల్పించాలని కోరారు. ఆన్‌లైన్ మస్టర్‌ను రద్దుచేసి పాత పద్ధతిని అమలు చేయాలన్నారు. కూలీలకు పనులకు సంబంధించిన పేస్లిప్‌లను ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పని చేసే మేట్లకు స్మార్ట్ ఫోన్లు, ఐదు రూపాయల పారితోషికం ఇవ్వాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 'ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం.. కదలండి' అన్న పేరుతో మే 25న అనంతపురం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో జిల్లాలోని కూలీలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా అధ్యక్షులు ఎస్.సూరి, ఉపాధ్యక్షులు రాధాకష్ణ, ఎస్.కరీం, ఓబులేష్, సహాయ కార్యదర్శులు భాస్కర్, నాగప్ప, పెద్దయ్య, మల్లేశు , మున్ని తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

వైపిపి పని అయిపోయింది..

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం పని అయిపోయిందని మాజీమంత్రి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు అన్నారు. సోమవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బిసి సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య అధ్యక్షతన బీసీ సెల్ మరియు సాధికారిక కమిటీల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షగట్టి మరీ బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేశారన్నారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 16,800 రాజ్యాంగబద్ధ పదవులను దూరం చేశారన్నారు. 139 కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆయా కార్పొరేషన్ల ద్వారా అప్పులు తెచ్చుకుని బీసీ కులాలకు రుణం ఇవ్వకుండా మొండి చేయి చూపారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బిసిలు రాజకీయంగా, సామాజికంగా ఎదిగేందుకు బీసీ జనగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. టిడిపితోనే బీసీల అభ్యున్నతి సాధ్యమన్నారు. రానున్న రోజుల్లో బిసిలంతా ఏకమై వైసిపి ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీనరసింహులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజే నాగరాజు, దాసరి శ్రీధర్, జోన్ 5వ కన్వీనర్ జెరిపిటి నరసింహులు, గాండ్ల సాధికారిక రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి, కురుబ సాధికారిక రాష్ట్ర కన్వీనర్ గంగులకుంట రమణ, వడ్డెర సాధికారత రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, శాలివాహన సాధికారిక రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య, వాల్మీకి సాధికారిక జిల్లా కన్వీనర్ ప్రతాప్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శులు ఆదినారాయణ, నాగేంద్ర, నాయీ బ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ ఆనంద్, విశ్వబ్రాహ్మణ రాష్ట్ర డైరెక్టర్ సూర్యనారాయణ, వడ్డెర సాధికారిక జిల్లా కన్వీనర్ వన్నూరు, పాల ఏకరి రాష్ట్ర డైరెక్టర్ సుధాకర్, వాల్మీకి రాష్ట్ర డైరెక్టర్ మణిరవి, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

ఎయిమ్స్‌లో సంధ్యప్రియకు 351వ ర్యాంకు

ప్రజాశక్తి-అనంతపురం

ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో పోస్టు గ్రాడ్యుయేట్ వైద్య విద్యలో సీట్ల కోసం జరిగిన పరీక్షలో అనంత మెడికల్ కళాశాలలో 2016వ బ్యాచ్ విద్యార్థిని ఎస్.సంధ్యప్రియ ఆల్ ఇండియాలో 351వ ర్యాంకు కైవసం చేసుకుంది. దీంతో సోమవారం స్థానిక మెడికల్ కళాశాలలోని ప్రిన్సిపల్ ఛాంబర్‌లో సంధ్యప్రియ తల్లిదండ్రులు శివపార్వతి, సతీష్‌రెడ్డిని ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి ఘనంగా సన్మానించారు. సంధ్యప్రియ ఆల్ ఇండియాలో అత్యున్నత ర్యాంకు సాధించడం సంతోషకరమన్నారు. పీడియాట్రిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేయాలన్నదే తన లక్ష్యమని సంధ్యాప్రియ తెలిపిందన్నారు. అంతేగాకుండా నెలలో కనీసం రెండు, మూడు రోజులు పేదలకు ఉచిత వైద్యం అందించాలని చెప్పడం సంతోషకరమన్నారు. ఈమేరకు సంధ్యప్రియను అకడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెఎల్ సుబ్రమణ్యం, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లీశ్వరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీ నాయుడు, ఆఫీస్ సూపరిం టెండెంట్ రవి కుమార్, దామోదర్, తదితరులు అభినందించారు.

సంధ్యప్రియ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

నాడు-నేడు పనులను పూర్తి చేయండి

◆ పాఠశాల ప్రారంభం నాటికి మరమ్మతులు పూర్తికావాలి ◆ కలెక్టర్ ఎం.గౌతమి

స్పందనలో అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జూన్ 12న నూతన విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు మైనర్ మరమ్మతులను పూర్తి చేయాలని ఎంఈవోలను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టర్ స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పలు కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ఆమె నాడు-నేడు పనులపై ఎంఇఒలతో మాట్లాడారు. సెలవు దినాల్లో కూడా అధికారులు నాడు-నేడు పనుల పురుగోతిపై దృష్టి సారించాలన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంటగదులు, విద్యుత్ తదితర పనులను పూర్తి చేయించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం పాఠశాల ప్రారంభం అయ్యే రోజుకు చిన్నచిన్న పనులన్నీ పూర్తి చేయాలన్నారు. మే 25న నియోజక వర్గాల స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యున్నత మార్కులు సంపాదించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేసే 'జగనన్న అనిముత్యాలు' కార్యక్రమం నిర్వహణపై స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలన్నారు. నియోజక వర్గ స్థాయిలో టాపర్ల ఎంపికలో ఎటువంటి పొరబాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ప్రారంభమవగానే విద్యాకానుక కిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నివేదికల ప్రకారం జిల్లాలో 137 మంది డ్రాపవుట్లు ఉన్నాయని, తిరిగి ఆ విద్యార్థులను పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. పదవతరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గాయత్రీదేవి, డీఈవో సాయిరాం, సీపీవో ప్రేమ్‌చంద్, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, జెడ్పీ సీఈవో భాస్కర్‌రెడ్డి, డ్వామా పీడీ వేణుగోపాల్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ హసాన్ బాషా, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డిఎస్ఒ శోభారాణి పాల్గొన్నారు.

అర్జీలను పునరావృతం కానీయొద్దు

స్పందనలో ప్రజలు ఇచ్చే అర్జీలు మళ్లీమళ్లీ పునరావృతం కాకుండా వాటికి నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎమ్.గౌతమి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డిఆర్ఒ గాయత్రిదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అన్సెట్ సిఇఒ కేశవ నాయుడు, జెడ్పీ సిఇఒ భాస్కర్ రెడ్డి, ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 393 మంది అధికారులకు అర్జీలను అందజేశారు. అనంతరం కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో స్వీకరించే అర్జీలు నాణ్యతగా పరిష్కరించక పోవడం వల్లనే అవి మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయన్నారు. అలా కాకుండా సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి పూర్తి పరిష్కారం చూపితే పునరావృతం కావన్నారు. జగనన్నకు చెబుతాం కార్యక్రమంపై వర్క్ షాపులు నిర్వహించి, వారి సిబ్బందికి అర్జీల పరిష్కారంపై అవగాహన కల్పించాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు ఇంకా చర్యల నివేదికలను పంపని అధికారులు, ఆ సమస్యలపై తీసుకున్న చర్యల నివేదికలను వెంటనే సిపిఒకు పంపాలన్నారు. మండల కేంద్రాల్లో నిల్వ చేసి ఉన్న జగనన్న విద్యా కానుక కిట్లను తనిఖీ చేసి వారు గుర్తించిన లోటుపాట్లపై నివేదిక పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయండి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

భిక్షాటన చేసుకుంటూ వచ్చిన సొమ్ముతో కాలం వెళ్లదీస్తున్నా. ఈ క్రమంలో కొద్దిరోజులు చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాను. ఇంతలోనే అధికారులు రేషన్‌కార్డులో పేరు తొలగించ డంతో పాటు వృద్ధాప్య పింఛన్ తొలగించారని మండల పరిధిలోని ఉంతకల్ గ్రామానికి చెందిన దళిత సుంకమ్మ వాపోయింది. బతుకుతెరువు కోసం మరో గ్రామానికి వెళ్తే మరణించినట్లు చిత్రీకరిస్తారా ఇదెక్కడి న్యాయమని ప్రశ్నిస్తోంది. నిరుపేదనైన నేను ఊరూరా తిరుగుతూ భిక్షాటన చేసుకొని బతుకుతుంటే అధికారులు మానవత్వం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది. రేషన్ కార్డు రద్దు చేయడంతో బియ్యం ఇవ్వడం లేదు, అనారోగ్యం బారిన పడితే ఆరోగ్యశ్రీ కూడా వర్తించదు నేను ఎలా బతకాలని ప్రశ్నిస్తోంది. భూస్వాములు, అగ్రవర్ణాలకు పింఛన్ ఇస్తున్న అధికారులు దళితురాలైన నాకు తొలగించడం ఎంతవరకు సమంజసమని కన్నీటి పర్యంతమైంది. ఇప్పటికే సచివాలయంలో ఐదుసార్లు, స్పందన కార్యక్రమంలో అర్జీ ఇవ్వగా మీ సమస్య పరిష్కరించామని మెసేజ్ వచ్చింది కానీ, నాకు రేషన్ కార్డు రాలేదు.. పింఛన్ రాలేదని ఆమె పేర్కొన్నారు.

భిక్షాటన చేస్తున్న సుంకమ్మ

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకూ పట్టణంలోని రెండు సచివాలయా ల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నాల్గో సచివాలయం(పాత కరెంటు ఆఫీస్ పక్కన), 11వ సచివాలయం ప్రయివేటు బస్టాండు (మేదర వీధిలో) వద్ద ఉన్న సచివాలయాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఈ కేంద్రాలు పని చేస్తాయన్నారు. ఐదేళ్ల నుంచి 15 ఏళ్ల వరకు, 15 ఏళ్లు పైబడిన వారికి కొత్తగా ఆధార్ నమోదు, అప్‌డేషన్, మొబైల్ నంబర్ లింక్, చేర్పులు, మార్పులు, 60 ఏళ్లపైబడిన వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ చేస్తారన్నారు. పట్టణ ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కేతు విశ్వనాథరెడ్డికి సిపిఎం నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాయలసీమ జనజీవితాన్ని అద్భుతంగా తన కథల్లో మలిచిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మతికి సిపిఎం జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపం ప్రకటించింది. అనేక రచనలు, పరిశోధనలు చేసి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్న కేతు విశ్వనాథరెడ్డి మరణించడం ప్రజా సాహిత్య రంగానికి తీరనిలోటు అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ తెలిపారు. విశ్వనాథరెడ్డి మరణం సీమ సమాజానికి తీరని లోటు అన్నారు. రాయలసీమ కథా సాహిత్యం, ఆధునిక ప్రగతిశీల భావాల వ్యాప్తికి ఆయన చేసిన కృషి నేటి యువతరానికి ఆదర్శమన్నారు.

మీడియాపై దాడి అప్రజాస్వామికం : సిపిఎం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి ఎంపి అవినాష్ రెడ్డి అనుచరులు విలేకర్లు, మీడియా వాహనంపై దాడి చేయడం అప్రజాస్వామికమైన చర్యని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాత్రికేయులపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపి అవినాష్ రెడ్డి హైదరాబాద్‌లో సిబిఐ కోర్టుకు హాజరు కాకుండా తిరిగి వెళున్న సందర్భంలో వారిని అనుసరిస్తున్న టివి ఛానెల్ వాహనంపై ఆయన అనుచరులు రాళ్లతో దాడి చేసి కెమెరాలను ధ్వంసం చేయడం, విలేకరిని గాయపరిచడం చాలా దారుణమైన ఘటన అన్నారు. ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించకుండా నిందితులను అరెస్టు చేయకపోవడం వల్ల వారు మరింతగా రెచ్చిపోయి ఆదివారం మళ్లీ పాత్రికేయులపై దాడి చేశారన్నారు. మీడియా స్వేచ్ఛను హరించే విధంగా అధికార పార్టీ అనుచరులు దాడులకు పాల్పడడం అప్రజాస్వామికం. అరాచకం అన్నారు. ఈ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా నియంత్రించాలని డిమాండ్ చేశారు.

గాలివాన బీభత్సం..

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, అరటిచెట్లు

ప్రజాశక్తి-రాయదుర్గం

మండల పరిధిలోని మల్లాపురం, పల్లెపల్లి గ్రామాల్లో ఆదివారం సాయంకాలం కురిసిన గాలివాన బీభత్సం సష్టించింది. గాలివాన ధాటికి మల్లాపురం గ్రామ సమీపంలోని విప్రమల నరసింహస్వామి ఆలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన రేకుల షెడ్డు షీట్లు ఎగిరిపడ్డాయి. దీంతో రూ. లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు తిప్పేస్వామి తెలిపారు. అలాగే మల్లాపురం, పల్లేపల్లి, రాయదుర్గం పరిసర ప్రాంతాలోల పెద్ద పెద్ద వక్షాలు, అరటి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ అధికారులు తక్షణమే స్పందించి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నరసింహస్వామి ఆలయం వద్ద గాలికి ఎగిరిన ఇనుప రేకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

పారిశుధ్యం మెరుగుకు ప్రాధాన్యత : మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో పారిశుధ్య మెరుగుకు ప్రాధాన్యత ఇస్తున్నామని మేయర్ మహమ్మద్ వసీం తెలిపారు. సోమవారం నగరంలోని 43, 46, 48వ డివిజన్ల పరిధిలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణ తీరును మేయర్ పరిశీలించారు. ఇందులో భాగంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం మెరుగుపర్చడంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఇంటింటికీ చెత్త సేకరణకు వచ్చే కార్మికులకు అందించాలని సూచించారు. ఇకపోతే సచివాలయ సిబ్బంది స్థానికులకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఆదేశించారు. అదేవిధంగా కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించి, రానున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పూడికతీత పనులను చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇషాక్, శ్రీనివాసులు, ఎంహెచ్ఒ గంగాధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ తీరును పరిశీలిస్తున్న మేయర్ వసీం

ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు : డీఎస్పీ

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణ పరిధిలోని ప్రజలు ట్రాఫిక్ ఆంక్షలు పాటించకపోతే చర్యలు తప్పవని డీఎస్పీ యు.నరసింగప్ప హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్ వరకూ 1వ, 2వ పట్టణాల సీఐలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుకిరువైపులా ఫుట్‌పాత్‌లపై అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలు, షాపులు ముందు ఉంచిన వస్తువులు క్లియర్ చేయిస్తూ, దుకాణాల యజమానులకు ట్రాఫిక్‌పై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ ఆంక్షలు పాటించాలన్నారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు. అలా ఇస్తే ఏమైనా జరిగితే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, ట్రిపుల్ రైడింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అలాగే ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫాం ధరించాలని, ఆటో సీరియల్ నంబర్ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో 1వ, 2వ పట్టణ సిఐలు రామసుబ్బయ్య, గణేష్,స్పెషల్ పార్టీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ నరసింగప్ప

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ప్రభుత్వం వేసవిలో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి శిబిరంలో ఎక్కువ మంది పాల్గొనడం సంతోషకరమన్నారు. దదాదాపు 27 మంది విద్యార్థులు హాజరై కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పుట, ఆటలు క్యారంబోర్డు, చెస్, పాముపటం, యోగా వంటి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఎల్ఎం.మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరానికి వచ్చిన చిన్నారులతో ఎల్ఎం ఉమామోహన్‌రెడ్డి

మీడియాపై దాడి ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ : కాలవ

రాయదుర్గం : వైసిపి ఎంపి అవినాష్ రెడ్డి అనుచరులు మీడియా ప్రతినిధులు లక్ష్యంగా జరిపిన దాడులు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంల ఓ వీడియో ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్, కర్నూలు నగరాల్లో ఎంపి అవినాష్ రెడ్డి ఇంటి దగ్గర విధులు నిర్వహిస్తున్న ఏబిఎన్, ఆంధ్రజ్యోతి, ఈటీవీ మీడియా ప్రతినిధులపై వైసిపి నాయకులు దాడులు చేయడం, రాష్ట్రంలో దిగజారిన శాంతి భద్రతలను తేటతెల్లం చేస్తున్నాయన్నారు. పాత్రికేయులపై జరుగుతున్న దాడులపై పోలీసులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. పాత్రికేయుల భద్రతకు పెను ప్రమాదంగా మారిన వైసిపి దాడుల నుంచి ప్రజాస్వామ్యాన్ని, పాత్రికేయులను రక్షించాలని రాష్ట్ర గవర్నర్‌కు విన్నవించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కాలవ డిమాండ్ చేశారు.

మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు శిక్షణ

అనంతపురం : రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ వై.కామేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాలో పని చేస్తున్న 433 మంది మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా ప్రథమ చికిత్స, పాముకాటు, సెలైన్ ద్రావణాలు ఎక్కించడం, గాయాలకు కట్టు కట్టుట, కుట్లు వేయుట, అన్ని రకాల సూది మందులు అందించడంపై సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుజాత, డాక్టర్ చెన్నకేశవులు, లక్ష్మీనారాయణ, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లలిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి

శింగనమల : మే 28 నుంచి జూన్ 6 వ తేదీ వరకు విశాఖలో నిర్వహించే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. ఈమేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటంతోపాటు విద్యారంగంలో వస్తున్న మార్పులను అధ్యయనం చేయడానికి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరిమెల గిరి, నాని, రఘు, గిరి, నరేంద్ర, సోమశేఖర, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీపడకుండా అభివృద్ధి పనులు

అనంతపురం సిటీ : అనంత రూరల్ మండలం రుద్రంపేట గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేస్తున్న సిసి రోడ్డు నాణ్యతలో ఏమాత్రం రాజీ పడకుండా చేయాలని సర్పంచి సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. సోమవారం పంచాయతీలోని అజయ్ ఘోష్ కాలనీలో చేస్తున్న సీసీరోడ్డు పనులను ఇంజినీరింగ్ అసిస్టెంట్ లక్ష్మితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే సీసీ రోడ్డు, వేస్తున్నట్లు తెలిపారు.

జెఎన్‌టియు మొదటి సంవత్సరం బిటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మొదటి సెమిస్టర్ (ఆర్20), ఎంసిఎ మొదటి, 3వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ పి.సుజాత సోమవారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో బీటెక్ మొదటి సంవత్సరం 40 శాతం, ఎంసిఎ మొదటి సెమిస్టర్ 93 శాతం, మూడవ సెమిస్టర్ 89శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. రీవ్యాల్యుయేషన్ చేయించుకోవాలనుకునే విద్యార్థులు మంగళవారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

డీ.హీరేహాళ్ తహశీల్దార్‌గా ఈశ్వర్‌రెడ్డి



డి.హీరేహాల్: మండల తహశీల్దార్‌గా ఈశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. 8 నెలలుగా ఇన్‌ఛార్జి తహశీల్దార్‌గా డిప్యూటీ తహశీల్దార్ బస్వకుమార్ విధులు నిర్వహించారు. ఆ స్థానంలో కొత్తగా ఈశ్వర్‌రెడ్డిని నియమించడంతో సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూతన తహశీల్దార్ ఈశ్వర్‌రెడ్డికి వైసిపి నాయకులు కాశీపీరా, తదితరులు పూలమాల వేసి సన్మానించారు.

నేడు 'వాలంటీర్లకు వందనం'

రాయదుర్గం: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం(నేడు) ఉదయం 10 గంటలకు 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 18 వార్డుల సచివాలయాల పరిధిలోని వాలంటీర్లను సత్కరించడంలో భాగంగా 'వాలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహిస్తున్నామని అందులో పురపాలక మండలి సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

'ఉపాధి'ని కాపాడుకుందాం : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకుందాం.. కదలి రండి.. అంటూ సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సూరి, సిపిఎం మండల కార్యదర్శి విటి.రామాంజినేయులు మాట్లాడుతూ రెండు పూటలా పని రద్దు చేయాలని, 40 శాతం సమ్మర్ అలవెన్సు ఇవ్వాలని, వంద రోజులు పూర్తి చేసిన కుటుంబానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం పని చూపాలని, పని చేసే చోట టెంట్, నీళ్లు, మెడికల్ కిట్ ఇవ్వాలని, నీళ్లకు రూ.10, గునపం సానకు రూ.50, తట్టుకు 20 ఇవ్వాలని, ఆన్‌లైన్ మస్టర్‌ను రద్దు చేసి పాత పద్ధతిని కొనసాగించాలని, పే స్లిపులు ఇవ్వాలని, క్షేత్రస్థాయి మేట్లకు స్మార్ట్‌ఫోన్‌కు రూ.5 పారితోషికం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు పెద్ద ఎత్తున ఉపాధి కూలీలు, మేట్లు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు టి.పెద్దయ్య, కార్యదర్శి బి.భాస్కర్‌రెడ్డి, నాయకులు జి.వెంకటచౌదరి, ఉపాధి కార్మికులు సురేందర్, నారాయణ, నాగసుబ్బరాయుడు, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాసేవలో ప్రతి వాలంటీర్ సైనికుడే..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

ప్రజాసేవలో ప్రతి వాలంటీర్ ఒక సైనికుడిలా పనిచేస్తున్నారని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన వాలంటీర్లకు అవార్డులు అందజేయడంతోపాటు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్ల ద్వారా జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపి అధినేత తాను అధికారంలోకి వస్తే వాలంటీర్లను తొలగిస్తామని చెబుతున్నారన్నారు. సేవ చేస్తున్న వాలంటీర్లను తొలగించి దోచుకునే జన్మభూమి కమిటీలను మళ్లీ తెచ్చుకుంటారని ఎద్దేవా చేశారు. అయితే ఎవరూ ఖంగారు పడాల్సిన అవసరం లేదని, వచ్చేది కూడా వైసిపి ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఆలోచించాలని, ప్రభుత్వ పథకాలన్నీ రావాలంటే తిగిరి జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంపిపి యోగేశ్వరి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, ఎంపిడిఒ నిర్మలాకుమారి, సిడిపిఒ ఉమా శంకరమ్మ, నాయకులు ఎన్‌వి.నారాయణ, మల్లికార్జున్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, నాగవర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సర్పంచి నాగమణిమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండ : ప్రజా రంజక పాలన అందించడంలో వాలంటర్లదే కీలకపాత్ర అని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం విడపనకల్ మండల కేంద్రంలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పథకాల అమలులో వాలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ముఖ్యంగా జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు వివరించారు. అనంతరం వాలంటీర్లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపి తలారి రంగయ్య, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు వీరన్న, ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీతా రామాంజనేయులు, జెసిఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ బ్రహ్మయ్య, పిఎసిఎస్ ఛైర్మన్ శ్రీరాములు, విద్యా కమిటీ ఛైర్మన్ గిరిబాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రమేష్, ఎంఎల్ఒ కుళ్లాయిస్వామి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు సుంకన్న, సర్పంచులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం పొందిన వాలంటీర్లతో ఎమ్మెల్యే పద్మావతి, జెడీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

'నగరవనం'పై 'కాపు' నిర్లక్ష్యం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి నగర వనం అభివృద్ధిపై ఏమాత్రం శ్రద్ధ చూపక పట్టణ ప్రజల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా సోమవారం ఆయన టిడిపి హయాంలో రూపుదిద్దుకున్న నగరవనంపై ఆరో వీడియోను విడుదల చేశారు. ప్రజల వినోదం కోసం అటవీ శాఖ ద్వారా పట్టణ శివారులో రూ.2 కోట్లతో నగర వనం పార్కును అభివృద్ధి చేయడంతో పాటు భవిష్యత్తులో రూ. 25 కోట్ల ఖర్చుతో విస్తరించాలనుకున్నా మన్నారు. అయితే వైసిపి ఏలుబడిలో అది అంతులేని నిర్లక్ష్యానికి గురవుతోందన్నారు. నగర వనంలో ని ఏనుగు, పులి, జింక, తదితర జంతువుల బొమ్మలు రంగు మారి శిథిలావస్థకు చేరాయన్నా రు. పిల్లల ఆటవిడుపు పరికరాలు దెబ్బతిన్నాయన్నారు. పట్టణ ప్రజలు కుటుంబాలతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణంలో సంతోషంగా గడపాలనే ఉద్దేశంతో తాము నగర వనం పార్కు ఏర్పాటు చేయించామని తెలిపారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి ఎందుకు కొనసాగించలేకపోయారో ప్రజలు ప్రశ్నించాలన్నారు. పట్టణ ప్రజల పై 'కాపు' విద్వేషపూరితంగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఇకనైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నగర వనాన్ని అభివృద్ధి చేయాలని కాలవ విజ్ఞప్తి చేశారు.

నగర వనం వద్ద సెల్ఫీ ఛాలెంజ్ విసురుతున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

పారిశుధ్య కార్మికులకు సెలవులను వర్తింపజేయాలి

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అన్ని సెలవులనూ వర్తింపజేయాలని సిఐటియు అనుబంధ సంస్థ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.నాగభూషణం డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జి.శ్రీనివాసులుకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పండుగ, జాతీయ రెండవ శనివారం సాధారణ సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా బదిలీ కార్మికులను నియమించుకునేందుకు అనుమతి ఉన్నా గుత్తిలో మాత్రం బదిలీ కార్మికులను నియమించుకునేందుకు అనుమతి ఇవ్వడం లేదన్నారు. గత నాలుగు రోజులుగా ఆరుగురు కార్మికులకు మస్టరు వేయడం లేదన్నారు. పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులకు జిపిఎఫ్, ఇఎస్ఐ వంటి సౌకర్యాలు గుత్తేదారుల నుంచి ఎపిసి ఓఎస్ కు అనుసంధానం కావడంలేదన్నారు. అలాగే గుత్తి మున్సిపాలిటీ విస్తీర్ణం, జనాభాకు సరిపడ కార్మికులను నియమించి పనిభారం తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు, గుత్తి మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు కె.సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు కె.మహేష్, కార్యదర్శి ఎన్. రామాంజనేయులు, సహాయ కార్యదర్శి టి.సుంకన్న, కోశాధికారి కె.బాల రంగన్న తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.నాగభూషణం

కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

ఉపాధ్యాయుడికి డాక్టరేట్

రాయదుర్గం: మండల పరిధిలోని 74-ఉడేగోళం గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు సహాయకులుగా పనిచేస్తున్న నగేష్‌బాబుకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య పిల్లలమర్రి రాములు ఆధ్వర్యంలో "రాయలసీమ ఆధునిక కవిత్వం-ప్రాంతీయ చైతన్యం (1986-2015)" అంశంపై నగేష్‌బాబు చేసిన పరిశోధనకు కేంద్రీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టాను అందజేసింది. నగేష్ బాబుకు డాక్టరేట్ రావడం పట్ల తోటి ఉపాధ్యాయులు, మిత్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

కళ్యాణదుర్గం : నియోజకవర్గంలో నెల కొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఉన్నం మారుతిచౌదరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పార్టీ సీనియర్ నాయకులు చౌళం మల్లికార్జున, ఆర్జీ శివశంకర్, రామాంజనేయులు తదితరులతో కలిసి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ నెల రోజుల నుంచి సత్యసాయి తాగునీటి పథకం ఆగిపోయిందని, దీంతో నియోజకవర్గంలోని వంద గ్రామాలతో పాటు పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. సత్యసాయి వాటర్ ప్రాజెక్టులో మోటార్లు కాలిపోగా మరమ్మతులు చేయించలేదంటే ప్రభుత్వ పనితీరు ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. వెంటనే సత్యసాయి తాగునీటి పథకం సమస్యను పరిష్కరించకుంటే టిడిపి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఎంఇఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గుత్తి : మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మండల నూతన కార్యవర్గం సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సోమవారం గుత్తిలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఎఫ్ మండల కమిటీ గౌరవ అధ్యక్షులుగా జన్నే కుళ్లాయిబాబు, అధ్యక్షులు హెచ్.రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి ఆదినారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకురాలు కె.సునీత, నాయకులు జయన్న, కంబగిరి రాముడు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

గుత్తి : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తాడిపత్రి సెక్షన్ అటవీ శాఖ అధికారిణి ఎం.ఫ్లారెన్స్ దీపా పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో నూతనంగా నిర్మించిన గుత్తి కోట రైల్వేస్టేషన్ వద్ద పర్యావరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని స్థానికులతో ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్ఓ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పర్యావరణ, ప్రజలకు ముప్పు వాటిల్లే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించరాదన్నారు. చిరుధాన్యాలు తినడం వల్ల ప్రజల ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దవడుగూరు ఎఇఒ రాముడు, విశ్రాంత వార్డెన్ మల్లికార్జున, నేషనల్ గ్రీన్ కాప్ గుత్తి డివిజన్ కన్వీనర్ శ్రీధర్ గౌడ్, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌నాయుడు, నాయకులు దేవేంద్ర రాయల్, శ్రీకాంత్, ఆటో యూనియన్ నాయకులు నాగార్జున, బాషా, నజీర్, ఓబులేష్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటిన తాడిపత్రి సెక్షన్ అటవీ శాఖ అధికారిణి ఎం.ఫ్లారెన్స్ దీపా

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత 'కేతు'కు నివాళి

అనంతపురం : రాయలసీమ జనజీవితాన్ని సంక్లిష్టతలను కథలుగా మలిచి కొత్తతరానికి మార్గదర్శిగా నిలిచిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథరెడ్డికి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత, రాయలసీమ సాంస్కృతిక వేదిక అధ్యక్షులు అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ కడప జిల్లా గ్రామనామాలపై పరిశోధన, మాండలికాలు, ఆధునిక తెలుగు వచనం, పత్రికల భాష, పాఠ్యపుస్తకాల నిర్మాణం ఇలా భాషాశాస్త్ర పరంగా విశ్వనాథరెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయాన్ని కొనసాగిద్దామని పిలుపునిచ్చారు.

4వ పట్టణ సిఐగా ప్రతాప్‌రెడ్డి

అనంతపురం క్రైం : 4వ పట్టణ సీఐగా ఆర్.ప్రతాప్‌రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా పులిచెర్లకు చెందిన ప్రతాప్‌రెడ్డి 2002లో ఎస్ఐగా చేరారు. 2011లో సీఐగా పదోన్నతి పొందారు. ఈనేపథ్యంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు, ఇతర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 4వ పట్టణ సిఐగా బాధ్యతలు స్వీకరించారు.

యాడికి సిఐగా సి.శంకర్‌రెడ్డి

యాడికి : నూతన సీఐగా సి.శంకర్‌రెడ్డి సోమవారం మండల కేంద్రంలో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు సిఐగా విధులు నిర్వహించిన రామకృష్ణ బదిలీపై నంద్యాల టౌన్‌కు వెళ్లారు. దీంతో అనంతపురం వచ్చిన సిఐ సి.శివ శంకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అలాగే మట్కా, నాటుసారా, అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలు కూడా తమకు సహకరించాలని కోరారు.

పాలిటెక్నిక్ ఫలితాల్లో 'విజన్' హవా

యాడికి : పాలిటెక్నిక్-2023 ఫలితాల్లో విజన్ పాఠశాల విద్యార్థులు హవా కొనసాగించినట్లు కరస్పాండెంట్ విశ్వనాథ్ తెలిపారు. పాలిటెక్నిక్ పరీక్షల్లో తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జి.లోకేష్ 101 మార్కులతో 873 ర్యాంకు (రాష్ట్రస్థాయిలో) ఎం.నాగేష్ 96 మార్కులతో 1309 ర్యాంకు, 88 మార్కులతో జి.చౌడమ్మ 2338 ర్యాంకు, 87 మార్కులతో ఎస్.మల్లికార్జునరావు 2633 ర్యాంక్, 87 మార్కులతో ఎస్.అఖిల 2639 ర్యాంకు, 85 మార్కులతో కృష్ణచేతన్ 2860 ర్యాంకు, 83 మార్కులతో నవీన్ 3401 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా 10వేలలోపు 25 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించి ఉచిత ఉన్నత విద్యకు ఎంపికైనట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎంపికైన విద్యార్థులను విజన్ యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా

బెలుగుప్ప : మండల పరిధిలోని రామసాగరం గ్రామానికి జనసేన నాయకులు కాశంశెట్టి సుధీర్ సోమవారం ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేశారు. గ్రామంలో 15 రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని జనసేన నాయకుడు సుధీర్ దృష్టికి తీసుకెళ్లడంతో మినరల్ వాటర్ ట్యాంకర్ ద్వారా రామసాగరం గ్రామానికి నీరు సరఫరా చేసి ప్రజల దాహార్తి తీర్చారు. దీంతో స్థానికులు సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాని, సాయి, మనోజ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.



ట్యాంకర్ నుంచి నీటిని పట్టుకుంటున్న ప్రజలు

నేడు సర్వసభ్య సమావేశం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పెద్దన్న అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యాదవేంద్ర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న ఈ సమావేశంలో వివిధ శాఖ అధికారులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

ఉద్యోగాలకు గేట్స్ విద్యార్థుల ఎంపిక

గుత్తి : గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో పలువురు గేట్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. హైదరాబాదుకు చెందిన ప్రముఖ ఫనెల్ డిజిటల్ మార్కెటింగ్ కంపెనీ జాబ్ మేళా నిర్వహించగా గేట్స్ కళాశాల చెందిన ఎంబీఏ చివరి సంవత్సరం చదువుతున్న రుచిత, ప్రేమ్, స్వరూప్, కీర్తన, భార్గవి, ప్రియాంక, సరిత, హేమలత డేటా అనాలాటిక్స్ మేనేజర్స్‌గా ఎంపికయ్యారు. ఉద్యోగులు పొందిన వారికి శిక్షణా సమయంలో కంపెనీ రూ.2 లక్షల వార్షికోత్సవం, శిక్షణ అనంతరం రూ.3.5 లక్షల వార్షిక వేతనం ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు., ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వీకే. పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి మేనేజింగ్ డైరెక్టర్ గజ్జల రఘునాథ్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సూరయ్య, ప్లేస్‌మెంట్ అధికారి తన్వీర్, హెచ్ఒడిలు పాల్గొన్నారు.

ఉద్యోగాలు పొందిన విద్యార్థులు

నేడు ఎమ్మెల్యే పద్మావతి పర్యటన

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మంగళవారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన వాలంటీర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొంటరన్నారు. సాయంత్రం చింతలపల్లి, బాలాపురం గ్రామాల్లో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అధికారులు, నాయకులు హాజరుకావాలని కోరారు.

ఎకరాకు రూ.50వేల రుణం ఇవ్వాలి

శింగనమల : స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు ఎకరాకు రూ.50 వేలు పెంచి బ్యాంకు రుణాలు ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.చెన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మండల పరిధిలోని సలకంచెరువు స్టేట్ బ్యాంకు వద్ద ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు అధికారులు రకరకాల షరతులతో రైతులను ఇబ్బందికి గురి చేయడం మంచిది కాదన్నారు. వెంటనే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు పెంచి ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం మండల అధ్యక్షులు బయన్న, నాయకులు నారప్ప, లక్షీరంగయ్య, శంకర, చెన్నప్ప, కోనప్ప, వెంకటరాముడు, నాగరాజు, పుల్లన్న, రైతులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన : సిడిపిఒ

శింగనమల : మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఓ ఉమాశంకరమ్మ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గ్రామాల్లో ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేస్తే రక్తహీనత తగ్గి బరువు తక్కువ పిల్లలు పుట్టే అవకాశాలు ఉంటాయన్నారు. కావున 21 సంవత్సరం నిండిన తర్వాతే ఆడపిల్లలకు పెళ్లి చేయాలన్నారు. ఆడపిల్లలు పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆకుకూరలు, గుడ్డు, పాలు, వేరుశనగ చిక్కిళ్లు, ఐరన్ టాబ్లెట్లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, హేమలత, నాగమణి, అన్నపూర్ణాదేవి, అంగన్వాడీలు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో చోరీ

గుత్తి : పట్టణంలోని నేహా కాలనీలో ఆదివారం రాత్రి ఓ ఇంటిలో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉండే ఈశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఊరెళ్లారు. గమనించిన గుర్తుతెలియని దుండగులు ఇంటి తాళాలు పగల కొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను బద్దలు కొట్టి అందులోని రెండు తులాల బంగారు నగలు, రూ.21 నగదును దోచుకు వెళ్లారు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.